సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



జయంతిని జయప్రదం చేయండి

సిరిసిల్లకల్చరల్: అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు.



బోయినపల్లి టు కొండగట్టు

బోయినపల్లి(చొప్పదండి): స్థానిక సీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి శనివారం రాత్రి పలువురు హనుమాన్ దీక్షాపరులు కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0/23.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం పడే అవకాశం లేదు. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రైతుల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

బోయినపల్లి(చొప్పదండి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని అనంతపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందీప్‌కుమార ఝాతో కలిసి శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్న బియ్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీవో ప్రణీత, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్, పార్టీ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, జంగం అంజయ్య, వంగపల్లి సత్యనారాయణరెడ్డి, జంగ సత్యం, సంబ లక్ష్మిరాజం, ఏనుగుల కనుకయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని రాంరెడ్డిపల్లి, కొండాపూర్, రామలక్ష్మణపల్లి, ఆవునూర్, తుర్కపల్లి గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్రను శనివారం చేపట్టారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు చేపట్టిన పాదయాత్ర విజయవంతం చేశారన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేల కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. ఉచిత బస్సు, ఉచిత విద్యుత్‌తోపాటు అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, పాదయాత్ర ఇన్‌చార్జి నాగం కుమార్, సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, బొందుగుల దేవిరెడ్డి, రాజు, సిద్దారెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆఫీస్‌లో బదిలీ ఉద్యోగి

బోయినపల్లి(చొప్పదండి): స్థానిక తహసీల్దార్ ఆఫీస్‌లో ఇటీవల బదిలీపై వెళ్లిన ఓ ఉద్యోగి సెలవు రోజైన శనివారం ప్రత్యక్షమవడం చర్చకు దారితీసింది. సదరు ఉద్యోగిని బదిలీ చేయాలని పలువురు నాయకులు ఇటీవల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బోయినపల్లిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి వచ్చిన సందర్భంలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ మరుసటి రోజే ఆ ఉద్యోగిని బదిలీ చేశారు. సదరు ఉద్యోగి స్థానంలో మరొకరు చార్జీ తీసుకున్నారు. అయితే శనివారం ఆఫీస్‌కు ఎందుకు వచ్చాడనే చర్చ మండల కేంద్రంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయంపై తహసీల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా బీరువా తాళాలు ఇచ్చి వెళ్లినట్లు తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన టీచర్‌పై ఫిర్యాదు



గాయాలు చూపిస్తున్న విద్యార్థి తల్లి

గంభీరావుపేట(సిరిసిల్ల): తన కొడుకును టీచర్ కొట్టాడని ఓ తల్లి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన వివరాలు. గంభీరావుపేటలోని కేజీ టు పీజీ విద్యాసంస్థలోని ప్రైమరీ స్కూల్ టీచర్ అదే స్కూల్‌లో చదివే ఓ విద్యార్థిని చితకబాదాడు. ఒకటో తరగతి చదువుతున్న లవన్‌సాయిని టీచర్ దేవరాజు కొట్టాడని విద్యార్థిని తల్లి జ్యోతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

జై బోలో హనుమాన్‌కీ..

- వేడుకగా సాగిన రథోత్సవం
- అగ్రహారంలో వైభవంగా సాగిన అంజన్న జాతర



ఆంజనేయస్వామి విగ్రహం



కొండగట్టు ఆలయంలో క్యూలైన్లలో బారులు తీరిన హనుమాన్ భక్తులు

వేములవాడఅర్బన్: 'జై బోలో హనుమాన్‌కీ.. పవనసుత హనుమాన్‌కీ.. జై'.. నామస్మరణలతో వేములవాడ మండలం అగ్రహారం జోడాంజనేయస్వామి ఆలయ పరిసరాలు మారుమోగాయి. ఆంజనేయస్వామి జయంతి శనివారం అత్యంత వైభవోపేతంగా జరిగాయి. అర్చకులు ఉదయం 4గంటలకు సుప్రభాతసేవ, 4.30 గంటలకు మన్యసూక్త అభిషేకం, బాలభోగం, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ కొనసాగాయి. అనంతరం ఆలయంపై జెండా ఎత్తి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. అంజన్నను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో నాగరపు శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కొండగట్టులో అంజన్నను భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



అగ్రహారంలో రథాన్ని లాగుతున్న మాలధారులు



ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



కొండగట్టుకు తరలివస్తున్న దీక్షాస్వాములు, భక్తులు

రవాణాశాఖ ఆదాయం రూ.39.25కోట్లు

- జిల్లా రవాణాశాఖ అధికారి వి.లక్ష్మణ్



వి.లక్ష్మణ్

సిరిసిల్ల: జిల్లాలో రవాణాశాఖ 2024–2025 ఆర్థిక సంవత్సరంలో రూ.39.25కోట్ల మేరకు ఆదాయాన్ని సమకూర్చిందని జిల్లా రవాణాశాఖ అధికారి వి.లక్ష్మణ్ శనివారం తెలిపారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 నాటికి రవాణాశాఖ ద్వారా రూ.39.25కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు వాహనాల ద్వారా మూడు నెలలకోసారి చెల్లించే పన్నులు రూ.6.78కోట్లు, లైఫ్ ట్యాక్స్ రూపంలో రూ.22.57కోట్లు, సర్వీస్ చార్జీల ఫీజులుగా రూ.1.40కోట్లు, వివిధ రకాల ఫీజులుగా రూ.4.68కోట్లు, గ్రీన్‌ట్యాక్స్‌లుగా రూ.53 లక్షలు, డిటెక్షన్ రూపంలో మరో రూ.1.43 కోట్లు, జరిమానాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కాంపౌండింగ్ ఫైన్లు రూ.1.84కోట్లు వచ్చాయని వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సిరిసిల్లటౌన్: ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయలలాని బీఆర్‌ఎస్‌వై రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ కోరారు. స్థానిక తెలంగాణ భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. గురుకుల భవనాలకు కనీసం అద్దె చెల్లించకుండా తాళాలు వేసే దుస్థితి ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. మట్టె శ్రీనివాస్, సామల శ్రీకాంత్, ఆదిచెర్ల సాయి, కాసర్ల వినయ్, మ్యాన కృష్ణ, కొండి నవీన్, రాపెల్లి భాను, కస్తూరి అజ్జు, సాయి, గణేష్ పాల్గొన్నారు.

మిగిలింది రెండు రోజులే !

- రాజీవ్ యువ వికాసానికి వెల్లువలా దరఖాస్తులు
- 14తో ముగియనున్న గడువు



ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల)/కోనరావుపేట(వేములవాడ): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తులకు రెండు రోజులే మిగిలి ఉంది. ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులను తీసుకుంటున్నారు. ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు ఆన్‌లైన్ చేయనున్నారు.

ఆన్‌లైన్ సేవలకు ఇబ్బందులు

దరఖాస్తుదారులు కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ గత రెండు రోజులుగా వెబ్‌సైట్ మొరాయిస్తోంది. గత నెలాఖరులో ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 4న ముగిసిపోవాల్సి ఉండగా 14 వరకు పొడిగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నిరుద్యోగులు, ఔత్సాహికులు ఆన్‌లైన్, మీసేవ సెంటర్ల వద్ద క్యూ కడుతున్నారు.

యూనిట్లు ఇలా..

రాజీవ్ యువ వికాసంలో నాలుగు రకాలుగా యూనిట్లు మంజూరు చేయనున్నారు. వంద శాతం సబ్సిడీతో రూ.50వేలు, 90 శాతం సబ్సిడీతో రూ.లక్ష, 80 శాతం సబ్సిడీతో రూ.2లక్షలు, 70 శాతం సబ్సిడీతో రూ.4లక్షల వరకు మంజూరు చేస్తారు. సబ్సిడీపోను మిగతాది బ్యాంక్ లోన్.

సద్వినియోగం చేసుకోవాలి



రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తుల సమర్పణకు ఈనెల 14వరకు గడువు ఉంది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోగాని, ఆఫ్‌లైన్‌లోగాని సమర్పించేందుకు వీలుంది. మండల పరిషత్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి అధికారులను అందుబాటులో ఉంచడం జరిగింది.

– రాజేందర్, ఎంపీడీవో, గంభీరావుపేట

సర్టిఫికెట్లకు దరఖాస్తు కావడం లేదు



రాజీవ్ యువశక్తి పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే కుల, ఆదాయం సర్టిఫికెట్లు కావాలి. వాటి కోసం దరఖాస్తు చేద్దామంటే సర్వర్ పనిచేయడం లేదు. దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లు కూడా రావడం లేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, కనగర్తి

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



కిష్టంపేటలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చందుర్తి(వేములవాడ): స్వశక్తి సంఘాల మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండలం కిష్టంపేట, చందుర్తి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. కిష్టంపేటలో నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణంలో పాల్గొన్నారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతోనే కొనుగోలు కేంద్రాల బాధ్యతను స్వశక్తి సంఘాలకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఈ ప్రాంతంలో కాలువలు, రిజర్వాయర్ పనులు చేయించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చలువతోనే సాగునీటి తిప్పలు తప్పాయన్నారు. చందుర్తి 176 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొనుగోలు కేంద్రానికి కావాల్సిన అనుమతులు ఇప్పిస్తామని తెలిపారు. చందుర్తి మండల సమాఖ్యకు బస్సు మంజూరైందని, మహిళా సంఘాల సభ్యులు ముందుకొస్తే రైస్‌మిల్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జెడ్పీటీసీ నాగం కుమార్, ఐకేపీ ఏపీఎం రజిత, నాయకులు ముస్కు ముకుందరెడ్డి, బానాల లక్ష్మారెడ్డి, పోతుగంటి రఘుపతి, మోకనపల్లి దేవరాజు, బానాల గంగారెడ్డి, గొట్టె ప్రభాకర్, పులి సత్తయ్య, దారం చంద్రం పాల్గొన్నారు.

కాళేశ్వరం కాల్వ పనుల్లో కదలిక



మల్కపేట కుడికాల్వలో మట్టిని తొలగిస్తున్న అధికారులు



సుద్దాల వద్ద పైపులైన్ పనులు

- పూడికతీత, పైపులైన్ పనులు ప్రారంభం
- నీటిపారుదల విభాగం–8 ఈఈ కిశోర్

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్ల: కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ పనుల్లో కదలిక వచ్చింది. ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు ప్రధానంగా భూసేకరణ అడ్డంకిగా ఉండడంతో తాత్కాలికంగా నీటి సరఫరాకు అడ్డుగా ఉన్న కాల్వల్లోని పూడిక తొలగింపు, అర్ధంతరంగా నిలిచిన పైపులైన్ పనులను మొదలుపెట్టారు. 'సాక్షి'లో 'కొనసముట్టని కాళేశ్వరం' శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. కోనరావుపేట మండలం కనగర్తి–సుద్దాల మధ్య కాల్వలో పేరుకుపోయిన మట్టిని తొలగించే పనులతోపాటు సుద్దాల వద్ద మల్కపేట రిజర్వాయర్ నీరు మారుపాకకు వెళ్లేలా పైపులైన్ పనులు చేస్తున్నా రు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని వేములవాడ అర్బన్ మండలం మారుపాక వరకు గోదావరి జలాలు చేర్చాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో నీటిపారుల శాఖ ఈఈ కిశోర్ పనులు ప్రారంభించారు. మధ్యమానేరు నుంచి మల్కపేట వరకు 12.035 కిలోమీటర్ల సొరంగం పనులు పూర్తయ్యాయని, కాంక్రీట్ లైనింగ్, సర్జిపూల్, పంప్‌హౌస్, డెలివరీ పైపులైన్ పూర్తి చేసి మల్కపేట రిజర్వాయర్‌లో ఒక్క టీఎంసీ నీటిని నింపామని కిశోర్ వివరించారు. మల్కపేట నుంచి కెనాల్ ద్వారా మైసమ్మ చెరువు వరకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

భూసేకరణ అడ్డంకి

మల్కపేట శివారులోని ఊర చెరువు శిఖం భూముల రైతులు తమ పొలాలు మునుగుతా యని భూసేకరణను అడ్డుకుంటున్నారని ఈఈ కిశోర్ వివరించారు. ఎన్నిసార్లు అవగాహన కల్పించినా సహకరించడం లేదన్నారు. ఈ సమ స్య పరిష్కారమైతే.. మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటి విడుదల సాధ్యమవుతుందని తెలిపారు.

రూ.138కోట్లతో అదనపు ఎత్తిపోతలు

కోనరావుపేట, వీర్నపల్లి మండలాల్లో 10వేల ఎకరాలకు సాగునీరు అందించే అదనపు ఎత్తిపోతల పథకానికి రూ.138కోట్లతో మెగా కంపెనీతో ఒప్పందం జరిగిందని ఈఈ కిశోర్ తెలిపారు. ఈ ఎత్తిపోతలకు 212 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 26.30 ఎకరాలు పూర్తయిందని తెలిపారు. భూసేకరణ పూర్తయితే అదనపు ఎత్తిపోతల పథకాలతో 10వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని కిశోర్ వివరించారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా నీరు అందిస్తామని స్పష్టం చేశారు.

తల్లడిల్లుతున్నారు

- ప్రమాదాల్లో పోతున్న ప్రాణాలు
- మృతుల్లో అత్యధికులు యువకులే
- తల్లిదండ్రులకు కడుపుకోత
- నెల రోజుల్లో 35 ప్రమాదాలు.. 8 మంది మృతి
- వరుస ప్రమాదాలతో వణుకుతున్న వాహనదారులు
- నివారణ చర్యలు పట్టించుకోని అధికారులు



హరిదాస్‌నగర్ శివారులో ఢీకొన్న ఆటో, ద్విచక్రవాహనం (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): త్వరగా గమ్యం చేరుకోవాలన్న ఆతృతలో ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నపాటి ఏమరపాటుతో ప్రాణాలు పోతున్నాయి. మరికొందరైతే శాశ్వతంగా అవిటితనంతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల రాజన్నసిరిసిల్ల జిల్లాలో వరుసగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు ప్రాణాలు కోల్పోతుండడం తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతోంది. జిల్లాలో నెల రోజుల వ్యవధిలో 35 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. 8 మంది ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబాలకు గుండెకోత మిగులుతోంది. వరుస ప్రమాదాలు.. పోతున్న ప్రాణాలపై ×సాక్షి₹ ప్రత్యేక కథనం.

ఇరువై ఏళ్లకే నూరేళ్లు

తెలిసీతెలియని వయసు.. స్నేహితుల ప్రభావం.. స్పీడ్‌బైక్‌లు.. వెరసి యువకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ప్రమాదాలు జరుగుతున్న సమయంలో వాహనాల వేగం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుండడమే ఇందుకు సాక్ష్యం. ఉన్నత విద్య చదువుకొని జీవితంలో స్థిరపడతారని అప్పుసప్పు చేసి చదివించిన తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుతోంది.

నిబంధనలు గాలికి..

జిల్లాలో వాహనదారులు వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నా పోలీసులు, ఆర్టీఏ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో హెల్మెట్ నిబంధనను పక్కాగా అమలు చేసిన పోలీసులు, ఆర్టీఏ అధికారులు ప్రస్తుతం గాలికొదిలేశారు. చలాన్‌లు విధించే దానిపై పెట్టిన శ్రద్ధ హెల్మెట్ ధరించని వారిని ఆపి ఒక్క మంచి మాట చెప్పే ఓపిక అధికారులకు లేకుండాపోయింది. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారందరూ హెల్మెట్ ధరించకపోవడం ఇందుకు నిదర్శనం. పోలీసులు, ఆర్టీఏ అధికారులు జరిమానాలు విధించడంపైన పెట్టే శ్రద్ధలో కనీసం పదోవంతు శ్రద్ధ అవగాహన కల్పించడంపై పెడితే ప్రాణాలను కాపాడిన వారు అవుతారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

నెల రోజుల్లో 8 మంది

- జిల్లాలో నెల రోజుల్లో జరిగిన ప్రమాదాల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ముగ్గురు ఇరువై ఏళ్ల లోపు యువకులే.
- ఒకే ప్రమాదంలో గాయపడ్డ ముగ్గురిలో నారాయణపూర్‌కు చెందిన షేక్ అఫీజ్, షేక్ అఫ్రోజ్ అనే యువకులు చికిత్స పొందుతూ మూడు రోజుల వ్యవధిలోనే మృతిచెందారు. ఇదే ప్రమాదంలో గాయపడ్డ ఆటోడ్రైవర్ దుర్గయ్య చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.
- కిష్టునాయక్‌తండాకు చెందిన శివరాత్రి సాయికృష్ణ తన తల్లిదండ్రులతో కలిసి కొండగట్టుకు దైవదర్శనానికి వెళ్లగా అక్కడ జరిగిన ఆటో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.
- నెల రోజుల్లో 35 ప్రమాదాలలో 8 మంది ప్రాణాలు గాలిలో కలిశాయి.

అతివేగంతోనే ప్రమాదాలు



ప్రమాదాల నివారణలో భాగంగా బ్లాక్‌స్పాట్స్ గుర్తిస్తున్నాం. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. హెల్మెట్ ధరించాలనే దానిపై వాహనదారులకు అవగాహన కల్పించాం. మళ్లీ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. వాహనాల వేగం తగ్గించడానికి ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్నాం. రోడ్లపై వాహనాల వేగం పరిమితిపై చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట సీఐ

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని పలువురికి గాయాలు



గాయపడిన ఆశాలు కుటుంబ సభ్యులు

రామగిరి(మంథని): కల్వచర్ల గ్రామ పరిధిలో శనివారం ట్రాక్టర్, కారు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యారు. ఎస్సై చంద్రకుమార్, స్థానికుల కథనం ప్రకారం.. మహదేవపూర్ మండల సూరారం గ్రామానికి చెందిన ములకల్ల ఆశాలు కుటుంబసభ్యులతో కలిసి కారులో కొండగట్టు వెళ్లి తిరిగి మహదేవపూర్ వెళ్తున్నాడు. కల్వచర్ల వద్ద లారీని ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా సెంటినరీకాలనీ నుంచి పెద్దపల్లి వెళ్తున్న బ్లేడ్ ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టింది. దీంతో కారులోని ఆశాలు, భార్య సువర్ణ, కూతురు సుజాత, అల్లుడు రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. రామకృష్ణ తల్లి రమాదేవికి సైతం గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తండ్రిని చంపిన తనయుడి రిమాండ్: సీఐ శ్రీనివాస్‌గౌడ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఒడ్డెరకాలనీకి చెందిన కుంచెపు కనకయ్యను కర్రతో కొట్టి చంపి పరారీలో ఉన్న అతని తనయుడిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎల్లారెడ్డిపేట ఠాణాలో శనివారం కేసు వివరాలను సీఐ శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా నిందితుడు కుంచెపు పర్శరాములు ఎల్లారెడ్డిపేటకు వచ్చినట్లు తెలుసుకుని గాలించామన్నారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సంచరిస్తున్నట్లు అందిన సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు. తండ్రి మందలించాడని ఆవేశంతో కన్న తండ్రినే హత్య చేసిన నిందితుడిని పట్టుకొని విచారించగా.. తానే హత్య చేసినట్లు అంగీకరించాడన్నారు. వెంటనే రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో సహకరించిన ఎస్సై రమాకాంత్, సిబ్బందిని సీఐ అభినందించారు.

భర్తకు అంత్యక్రియలు చేసిన భార్య

- క్షణికావేశంలో జైలులో కొడుకు
- ప్రాణాలు కోల్పోయిన భర్త
- ఒంటరైన మహిళ



భర్తకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న కనకయ్య భార్య దేవవ్వ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కడుపున పుట్టిన కొడుకు వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకుంటే కాలయముడిగా మారి కన్నతండ్రి ప్రాణాలు తీసి జైలుపాలయ్యాడు. కట్టుకున్న భర్త అంత్యక్రియలు భార్య నిర్వహించిన ఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కుంచెపు కనకయ్య(50) శుక్రవారం కన్నకొడుకు పర్శరాములు చేతిలో హతమైన విషయం తెలిసిందే. తండ్రి మృతికి కారణమైన కుమారుడు కుంచెపు పర్శరాములును పోలీసులు జైలుకు పంపించారు. కనకయ్య అంత్యక్రియలను అతని భార్య దేవవ్వ నిర్వహించడంతో స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.

నృసింహుని సన్నిధికి పోటెత్తిన భక్తులు





ధర్మపురి: ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం హనుమాన్ భక్తులతో శనివారం పోటెత్తింది. కొండగట్టు అంజన్నను దర్శించుకున్న భక్తులంతా లక్ష్మీనృసింహస్వామి సన్నిధికి చేరుకున్నారు. హనుమాన్ చిన్నజయంతి సందర్భంగా స్వామి అనుబంధం శ్రీప్రసన్నాంజనేయ స్వామివారికి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ భక్త భజన మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. నృసింహస్వామిని పలువురు నాయకులు దర్శించుకున్నారు. వీరిలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షుడు రామ్‌సింగ్, ప్రాంత గోరక్ష టోలి సభ్యులు ఊట్కూరి రాధాకృష్ణరెడ్డి, వాయుపుత్ర విభాగ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

బీ-థర్మల్‌లో బదిలీల కలకలం

- యాదాద్రి పవర్ ప్లాంట్‌కు 85 మంది
- ఉత్తర్వులు జారీచేసిన పవర్ జనరేషన్ కార్పొరేషన్

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండం థర్మల్ పవర్ స్టేషన్(ఆర్‌టీపీఎస్-బీ) 62.5 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ కేంద్రం మూతపడి పది నెలలు గడిచింది. ఈక్రమంలో శనివారం తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్, విద్యుత్ సౌధ నుంచి స్థానికంగా పనిచేసే 85 మంది ఉద్యోగులకు మూకుమ్మడి బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) విభాగానికి చెందిన ఉద్యోగులు ఉన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్‌తోపాటు ఓఅండ్ఎంకు చెందిన -72, ఇంజినీర్లు-11మంది, ఏడీఈలు-ఒకరు బదిలీ అయిన వారిలో ఉన్నారు. మరోరెండు రోజుల్లో రెండో జాబితాలో మిగతా విభాగాల ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు రానున్నాయనే ఊహాగానాలు వస్తున్నాయి. మరోవైపు.. ఉద్యోగ విరమణకు మరో మూడేళ్ల వ్యవధి ఉండే వారిని బదిలీ చేసే అవకాశం లేదని తెలుస్తోంది.

కాలంచెల్లిన జాబితాలో బీ-థర్మల్..

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే తొలి విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా ఉన్న రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ అనేక రికార్డులు సాధించింది. అరవై ఏళ్ల జీవిత కాలం పూర్తవడంతో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తాయి. అప్పటి సాంకేతిక పరిజ్ఞానానికి సరిపడే విడిభాగాలు లభించడంలేదు. దీంతో గతేడాది జూన్ 6వ తేదీన విద్యుత్ కేంద్రం మూతపడింది.

మూడు తరాలతో విడదీయరాని బంధం..

తాతలు, తండ్రులు, చివరగా కుమారులు.. ఇలా మూడు తరాలు విద్యుత్ కేంద్రంతో విడదీయరాని బంధం కలిగి ఉన్నారు. ఇక్కడే ప్రస్తుతం యాదాద్రి విద్యుత్ కేంద్రానికి బదిలీ చేస్తూ ఒక్కసారిగా ఉత్తర్వులు వెలువడడంతో ఉద్వేగానికి లోనవుతున్నారు.



బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం ముఖద్వారం

స్థానికంగా కొందరు

యాదాద్రిలో 800 మెగావాట్ల సామర్థ్యంతో ఐదు విద్యుత్ కేంద్రాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఒక యూనిట్ పూర్తయ్యింది. త్వరలో రెండో యూనిట్ కమీషన్ చేసే అవకాశం ఉంది. ఇలా దశలవారీగా అన్నియూనిట్లను విద్యుత్ ఉత్పత్తి దశలోకి వేగవంతంగా తీసుకురావాలనే ఉద్దేశంతో ఇక్కడి ఉద్యోగులను మూకుమ్మడిగా యాదాద్రికి బదిలీ చేసినట్లు తెలిసింది. రెండో లిస్టులో ఎంతమందిని బదిలీ చేస్తారనే విషయమై స్పష్టత లేదు. ప్రస్తుతం ఉన్న బీ-థర్మల్‌ను కూలదోసే క్రమంలో స్థానికంగా కొంత మంది ఇంజినీర్లను స్థానికంగానే కొనసాగించే అవకాశాలున్నట్లు విశ్వసనీయ సమాచారం.

– దాసరి శంకరయ్య, ఇన్‌చార్జి ఎస్ఈ, బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం, రామగుండం

అంకుల్ ఫోన్ చేసుకుంటాం అంటూ..

- ఆర్టీసీ డ్రైవర్ సెల్‌ఫోన్‌తో ఉడాయించిన యువకులు
- డయల్ 100కు ఫోన్ చేస్తే స్పందించని పోలీసులు

శంకరపట్నం: 'అంకుల్ మా సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. ఒకసారి మీ ఫోన్ ఇస్తే.. ఒక కాల్ చేసుకుని ఇస్తాం'.. అంటూ ముగ్గురు యువకులు ఓ ఆర్టీసీ డ్రైవర్‌కు చెందిన సెల్‌ఫోన్ తీసుకుని ఉడాయించారు. ఈ ఘటన శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. మొలంగూర్ గ్రామానికి చెందిన సాయిరెడ్డి మెట్‌పల్లి డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని శుక్రవారం అర్ధరాత్రి మొలంగూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు దిగాడు. ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న సాయిరెడ్డికి ముగ్గురు యువకులు తారసపడ్డారు. 'అంకుల్ మా ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. ఫోన్ చేసుకుంటాం. ఒకసారి ఫోన్ ఇస్తారా' అని అడగడంతో సాయిరెడ్డి ఇచ్చాడు. వెంటనే బైక్ స్టార్ట్‌చేసి ముగ్గురు యువకులు సెల్‌ఫోన్‌తో ఉడాయించారు. సమీపంలోని ఇంటికి పరుగెత్తుకెళ్లిన సాయిరెడ్డి ఇంట్లో బ్యాగ్ పెట్టి, బైక్ తీసుకుని యువకులను వెంబడించాడు. జమ్మికుంటలో వారిని పట్టుకున్నాడు. రూ.1000 ఇస్తే సెల్‌ఫోన్ ఇస్తామని ఆ యువకులు చెప్పారు. ఇవ్వననడంతో మరోసారి సాయిరెడ్డి కళ్లుగప్పి పరారయ్యారు. సాయిరెడ్డి హడావుడిగా బయటికి వెళ్లడం గమనించిన ఆయన భార్య ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో కంగారుతో డయల్ 100ను సంప్రదించింది. వారినుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలిపింది. కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌కు శనివారం ఫిర్యాదు చేసేందుకు సాయిరెడ్డి వెళ్లాడు. వారు జమ్మికుంటలో ఫిర్యాదు చేయమన్నారని, జమ్మికుంట పోలీసులు కేశవపట్నంలో ఫిర్యాదు చేయాలని అంటున్నారని తెలిపాడు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు

కొత్తపల్లి: అల్ఫోర్స్ ఈ- టెక్నో పాఠశాల విద్యార్థులు జోనల్‌స్థాయి అంతర్జాతీయ సాంఘికశాస్త్ర ఒలింపియాడ్ పోటీల్లో బంగారు పతకాలను సాధించడంతో వారిని అల్ఫోర్స్ విద్య సంస్థల ఆధినేత వి.నరేందర్‌రెడ్డి శనివారం అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు బొంగోని కార్తికేయ, హరిశ్రీ హరిణి, ఎం.విఘ్నుష్చంద్ర, హిమేశ్‌చంద్ర బంగారు పతకాలను సాధించడం జరిగింది.

టైనీటాట్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలలో శనివారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అల్ఫోర్స్ విద్య సంస్థల ఆధినేత వి.నరేందర్‌రెడ్డి చిన్నారులకు పట్టాలు అందజేశారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత వి.నరేందర్‌రెడ్డి

చల్‌గల్‌లో మామిడి కొనుగోళ్లు ప్రారంభం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ మామిడి మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. వ్యాపారుల్లో కొందరు బహిరంగ వేలం ద్వారా.. మరికొందరు కమీషన్ ప్రతిపాదికన కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం ప్రతి వ్యాపారి బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేయాలని మార్కెట్ అధికారులు చెపుతున్నప్పటికీ కొందరు వ్యాపారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల మాజీమంత్రి జీవన్ రెడ్డితోపాటు రైతు సంఘం నాయకులు, మామిడి మార్కెట్‌లో బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మార్కెట్ ప్రారంభమైనా విధివిధానాలు నిర్ణయించకపోవడంతో రైతులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. రైతుల నుంచి వ్యాపారులు ఏమైనా కటింగ్‌లు చేస్తారా..? మార్కెట్ కమిటీకి వ్యాపారులు ఏ మేరకు మార్కెట్ ఫీజు చెల్లిస్తారు..? వంటి విషయాలు ఎవరికీ అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.



బహిరంగ వేలం ద్వారా మామిడి కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారులు

బంగినపల్లికి కిలో రూ.35 నుంచి రూ.46

చల్‌గల్ మార్కెట్‌లో బంగినపల్లి మామిడికి కిలో రూ.35 నుంచి రూ.46 వరకు పలుకుతోంది. దోరికి రూ.65 నుంచి రూ.70, హిమాయత్ రకానికి రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. చల్‌గల్ మార్కెట్‌కు 30 నుంచి 35 టన్నుల మామిడి కాయలు వచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు



గాయపడిన సారంగపాణి

ఓదెల(పెద్దపల్లి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన తెట్టె సురేశ్ గోపరపల్లిలో చేపట్టిన సీసీరోడ్డు పనులు చేసేందుకు వచ్చాడు. భోజన విరామ సమయంలో గోపరపల్లి నుంచి పెగడపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలపగిలి తీవ్రగాయాలు కావడంతో సుల్తానాబాద్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

బైక్ అదుపుతప్పిన మరో ఘటనలో..

మడక గ్రామానికి చెందిన పోశారం సారంగపాణి బైక్‌పై పొత్కపల్లి నుంచి మడకకు వస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశావాత్తు బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది సుల్తానాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

- తగలబడిన ఐదు వేల క్వింటాళ్ల ధాన్యం
- 85 వేల గన్నీ సంచులు దగ్ధం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల శివారులోని మహలక్ష్మీ రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మిల్లులో నిల్వ చేసిన ధాన్యం, గన్నీ సంచులు దగ్ధమైనట్లు రైస్‌మిల్ యజమాని గంగారెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున మిల్లులో మంటలు చెలరేగుతున్నట్లు అందులో పనిచేసే ఓ కార్మికుడు యజమాని గంగారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న ఆయన మంటలను గమనించి అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. డీసీఎస్ జితేందర్‌రెడ్డి, డీటీసీఎస్ ఉమాపతి, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రాజేందర్‌రావు, అగ్నిమాపక శాఖ అధికారి మల్లికార్జున్, ఆర్ఐ ఉమేశ్, పోలీసులు రైస్‌మిల్లు వద్దకు చేరుకొని ఘటనపై ఆరా తీశారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయాలతోపాటు నష్టంపై ఆరా తీశారు. మిల్లులో దాదాపు 20 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం నిల్వ ఉంది. అందులోంచి సుమారు 5 వేల క్వింటాళ్ల ధాన్యం, 85 వేల గన్నీ సంచులు దగ్ధమైనట్లు యజమాని అధికారులకు తెలిపారు. సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది.



రైస్‌మిల్లులో ఎగిసిపడుతున్న మంటలు

అగ్నిప్రమాదంలో రెండిళ్లు దగ్ధం

కథలాపూర్: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన సుద్దాల బుచ్చిరాజు, సుద్దాల మల్లమ్మ ఇళ్లు అగ్నిప్రమాదంలో కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. బుచ్చిరాజు శనివారం ఉదయం బయటకు వెళ్లి వచ్చి చూసేసరికి మంటలు అంటుకున్నాయి. కొద్దిసేపటికి ఇంట్లోని వంటగ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఇంటి పైకప్పు కూలింది. ఇంటిపక్కనే ఉన్న సుద్దాల మల్లమ్మ ఇంట్లోకి మంటలు వ్యాపించాయి. ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పేసింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షలు ఆర్థిక నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు..

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో శనివారం మూల శ్రీనివాస్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కరెంట్ వైర్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంచం, టీవీ, బట్టలు, ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు శ్రీనివాస్ వాపోయాడు.



గొడిశాలలో దగ్ధమైన ఇల్లు





రాజన్న క్షేత్రం.. కాషాయవర్ణం

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఆదివారం హనుమాన్ మాలధారుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమ ఇలవేల్పునకు మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాజన్న ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లోని హనుమాన్ విగ్రహాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చాం



ఎమ్మెల్యే కమలాకర్ కూతురు జాహ్నవికి ఎంబీబీఎస్ పట్టా ప్రదానం చేస్తున్న కేటీఆర్

- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్
- చల్మెడ మెడికల్ కళాశాలలో స్నాతకోత్సవం

కరీంనగర్‌రూరల్: బీఆర్ఎస్ హయాంలో విద్య, వైద్యరంగానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చినట్లు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో శనివారం 2019 సంవత్సరం ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రతీ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలను మంజూరు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుతూ వైద్యులుగా మారుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో వైద్యులకు ఏఐ చాలెంజ్‌గా మారుతుందని తెలిపారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ చల్మెడ మెడికల్ కళాశాల హైదరాబాద్ కళాశాలలకు దీటుగా వైద్యవిద్యను నేర్పిస్తుండటంతో తన కూతురును చేర్పించినట్లు తెలిపారు. కళాశాల చైర్మెన్ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ..తెలంగాణలో ఏ మెడికల్ కళాశాలలో లేని సిమ్యులేషన్ ల్యాబ్‌ను చల్మెడ వైద్య విద్యార్థులకు అందుబాటులోకి తీసుకరావడం జరిగిందన్నారు.అనంతరం 124మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, కళాశాల డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఆసీంఅలీ, వైస్ ప్రిన్సిపాల్ అనిత, సూపరింటెండెంట్ రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో లారీ, కంటైనర్ ఢీ



డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

- లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్
- రెండు గంటల పాటు నరకయాతన

మెట్‌పల్లి: పట్టణంలోని జాతీయ రహదారిపై శనివారం ఓ లారీ, కంటైనర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. సుమారు రెండు గంటల పాటు తీవ్ర అవస్థలు పడగా.. పోలీసులు శ్రమించి అతడిని బయటకు తీశారు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్షయ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడ్‌తో మహారాష్ట్ర వైపు వెళ్తోంది. మార్గమధ్యంలో మెట్‌పల్లి ఎస్సారెస్పీ వంతెన మీదకు రాగానే ఎదురుగా కంటైనర్ వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో గ్రానైట్ లారీ ముందు భాగం దెబ్బతింది. అందులో ఉన్న డ్రైవర్ పరదేశీ కుడికాలు అందులోనే చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న డీఎస్పీ రాములు, ఎస్సైలు కిరణ్‌కుమార్, అనిల్ అక్కడకు చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరోవైపు గ్రానైట్ లారీని అక్కడి నుంచి తొలగించడం కష్టంగా మారడంతో కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చివరకు రెండు క్రేన్ల సహాయంతో తొలగించారు. ట్రాన్స్‌పోర్టు సూపర్‌వైజర్ వెంకట్రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అపురూప శిల్పాలపై పట్టింపు కరువు

- పురావస్తు పరిశీలకుడు నాగిరెడ్డి

వేములవాడ: రాజన్న ఆలయ అనుబంధ భీమేశ్వర స్వామి గుడిలో ఏళ్లనాటి అపురూప శిల్పకళపై రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పురావస్తు పురావాస్తు పరిశీలకుడు నాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం భీమేశ్వరాలయంలోని మూలనపడేసిన శిల్పకళా రూపాలను స్థానిక చరిత్రకారుడు సంకెపల్లి నాగేంద్రశర్మతో కలసి పరిశీలించారు. 9వ శతాబ్దం నాటి గణేశ్, ఛాముండి, సప్తమాతలు, శివలింగాలు, నంది, కుబేర, జైన మహవీర, పార్శ్వనాథ శిల్పాలను ఆలయన ఆవరణలో పడేశారన్నారు. అపురూప శిల్పాలను కాపాడాల్సిన బాధ్యత దేవాదాయశాఖ అధికారులపై ఉందన్నారు.



భీమేశ్వరాలయంలో పడేసిన అపురూప శిల్పాలను చూస్తున్న నాగిరెడ్డి

వనజీవి రామయ్యకు జిల్లాతో అనుబంధం



సుద్దాల విద్యార్థులతో వనజీవి రామయ్య



రామయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు(ఫైల్)

- జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటున్న జిల్లా వాసులు
- రాజన్న సిరిసిల్లకు పలుమార్లు రాక

సిరిసిల్ల/కోనరావుపేట(వేములవాడ): వనజీవి దర్పల్లి రామయ్యతో జిల్లాకు అనుబంధం ఉంది. జిల్లాకు చెందిన ప్రకృతి ప్రేమికులు చేస్తున్న వనసంరక్షణ చర్యలను గుర్తించి జిల్లాలో పర్యటించారు. చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రచారం చేశారు. జిల్లాకు 2019వ సంవత్సరం జనవరి 13న వచ్చారు. కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రకాశ్ పర్యావరణ సేవలను గుర్తించి ఆ గ్రామానికి వచ్చారు. చెట్ల ప్రాముఖ్యతను ఆ గ్రామ పాఠశాల విద్యార్థులకు వివరించారు. జనవరి 19న సిరిసిల్ల కాలేజీగ్రౌండ్‌లో పర్యావరణ సదస్సుకు హాజరై.. మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అంతకుముందు మూడుసార్లు సిరిసిల్లకు వచ్చారు. అప్పటి కలెక్టర్ కృష్ణభాస్కర్ వనజీవి రామయ్యను సత్కరించారు. ఆయన మరణంపై పలువురు జిల్లా వాసులు సంతాపం తెలిపారు. రామయ్య మృతిపై సిరిసిల్లకు చెందిన ప్రకృతి ప్రకాశ్(దొబ్బల), సామాజిక సేవకుడు వేముల మార్కండేయులు సంతాపం తెలిపారు. రామయ్య మరణవార్త తెలియగానే ప్రకృతి ప్రకాశ్ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వెళ్లారు. రామయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించారు.



సిరిసిల్లలో వనజీవి రామయ్యతో ప్రకృతి ప్రకాశ్, వేముల మార్కండేయులు(ఫైల్)